సాక్షి రంగారెడ్డి

గురువారం ׀ 4 ׀ ఏప్రిల్ ׀ 2024




నేడే అవిశ్వాస పరీక్ష

'పట్నం' మున్సిపాలిటీలో గురువారం వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై బలపరీక్ష నిర్వహించనున్నారు. 8లో▸



కాంగ్రెస్ విజయం ఖాయం

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి డా.మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. 8లో▸



న్యూస్‌రీల్

ఎంత పెద్ద చేపలో..

కొండకల్ వీరన్న చెరువులో చిక్కిన పది కిలోల చేపలు



పది కిలోల చేపలను చూపిస్తున్న మత్స్యకారులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలం కొండకల్ సమీపంలో ఉన్న వీరన్న చెరువులో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లిన వారికి పది కిలోల బరువున్న రెండు పెద్ద చేపలు చిక్కాయి. వీటిని చూసిన మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఈ చెరువులో ఇంత పెద్ద చేపలు లభించలేదని చెప్పారు. చెరువులో 10 కిలోల చేపలు చిక్కాయని తెలియడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి వాటిని ఆసక్తిగా చూశారు. ఇలాంటి భారీ చేపలతో మత్స్యకారులకు మంచి లాభాలు ఉంటాయని సంఘం అధ్యక్షుడు మన్నె నర్సింలు తెలిపారు.

గ్యారంటీలపై గడపగడపకూ ప్రచారం చేయాలి

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

మీర్‌పేట: వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు క్లాం పద్మ తన అనుచరులతో కలిసి బుధవారం అనితారెడ్డి, కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అనితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రతి గడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు రవినాయక్, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, నాయకులు అమృతనాయుడు, రజిత, ఎల్లమ్మ, లక్ష్మి, సంధ్య, రేణుక, స్వామినాయక్, బాలకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో అధికారుల తనిఖీ



బయోమెట్రిక్ యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని పలు రేషన్‌షాపుల్లో బుధవారం పౌర సరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి బాలసరోజ మాట్లాడుతూ.. రేషన్‌షాపుల్లో బయోమెట్రిక్ యంత్రాలు దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదుతో కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఒక రేషన్ దుకాణానికి చెందిన యంత్రం మరొక షాపులో ఉండటాన్ని గుర్తించామని, దీనిపై ప్రశ్నించగా చార్జింగ్ పెట్టడం కోసం యంత్రాన్ని తేవడం జరిగిందని డీలర్ వివరణ ఇచ్చారని అన్నారు. విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

వాహన తనిఖీల్లో రూ.5 లక్షలు స్వాధీనం

షాబాద్: వాహన తనిఖీల్లో రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కాంతారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ చెక్ పోస్టు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మండల పరిధిలోని కక్కులూర్ గ్రామానికి చెందిన చాకలి తిరుపతయ్య తన కారులో రూ.5 లక్షలు తీసుకుని షాబాద్ వైపు వస్తున్నాడు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సదరు మొత్తాన్ని సీజ్ చేసి డీసీబీ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మక ద్రోహులకు గుణపాఠం చెప్పండి



అభివాదం చేస్తున్న కేటీఆర్, చిత్రంలో సబితారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్, కాలె యాదయ్య, ఇతర నేతలు

- అనామకులైన గడ్డం రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఎంపీలను చేసింది కేసీఆరే
- వారు తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకం
- కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

వికారాబాద్: గడ్డం రంజిత్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఇద్దరూ విశ్వాస ఘాతకులే.. అనామకులైన వారిని కేసీఆర్ అక్కున చేర్చుకొని ఎంపీలు చేస్తే.. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు వ్యవహరించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. నమ్మించి మోసం చేసిన వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విశ్వాసం లేని వ్యక్తి అని, గడ్డం రంజిత్‌రెడ్డి రన్నింగ్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి నిర్వాకంతోనే వికారాబాద్‌లో ఆనంద్, తాండూరులో రోహిత్‌రెడ్డి ఓడిపోయారని పేర్కొన్నారు. పరిగి కార్యకర్తల సమావేశంలో మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి కలిసి డ్రామాలు చేసింద్రు.. తాము పార్టీ మారడం లేదని చెప్పారు.. వీరి యాక్టింగ్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందేనని అన్నారు. మంత్రి అవుతానని మహేందర్‌రెడ్డి కలలో కూడా ఊహించి ఉండడని, అలాంటి వ్యక్తిని కేసీఆర్ మంత్రిని చేస్తే నమ్మించి మోసం చేశారని విమర్శించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నమ్మక ద్రోహులకు బుద్ధి చెప్పాలన్నారు.

సొంత జిల్లాను విస్మరించిన సీఎం: సబితారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాను కూడా విస్మరించారని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి విమర్శించారు. జిల్లాకు వచ్చిన ప్రతీసారి కొడంగల్ అంటున్నాడు.. నిధులన్నీ సొంత నియోజకవర్గానికే కేటాయిస్తున్నాడు పరిగి, వికారాబాద్, తాండూరు ఆయన సొంత జిల్లాలోనివి కావా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంత ఓటర్లు ప్రస్తుత ఎన్నికల్లో కర్రుగాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. అధికారం చేపట్టి నాలుగు నెలలైనా ఒక్కసారి కూడా పాలమూరు గురించి మాట్లాడారా? అధికారులతో సమీక్ష నిర్వహించారా అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో వికారాబాద్ జిల్లాగా ఏర్పాటైందని గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి అన్ని వనరులు సమకూర్చారని ఆమె గుర్తు చేశారు. కలెక్టరేట్, మెడికల్ కళాశాల బీఆర్‌ఎస్ హయాంలోనే నిర్మించారని తెలిపారు. కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం లాంటిదన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ప్రస్తుత ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిని ఓడించాలని.. బడుగుల నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

సేవ చేసే వారినే గెలిపించండి: కాసాని

జిల్లాలో సబ్బండ వర్గాల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశాను.. నా గురించి మీకందరికీ తెలుసు.. నన్ను గెలిపిస్తే మరింత సేవ చేస్తా అని బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గురించి అందరికీ తెలుసని, వారి గురించి కొత్తగా చెప్పేదేమీ లేదన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తే కరువు వస్తది అంటారు.. ఇప్పుడు అదే జరిగిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడారు. ఒక పార్టీలో ఉంటూ మరో పార్టీకి కొమ్ముకాసే నాయకులను నమ్మరాదని సూచించారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే ముందు వరుసలో నిలబెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మెతుకు ఆనంద్ తెలిసో తెలియకో కొందరిని దూరం చేసుకున్నారని, పని చేసిన వారికి పదవులివ్వకుండా కొత్తవారికి ఇవ్వడంతో కొంత నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు నాగేందర్ గౌడ్, కార్తీక్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, మాజీ ఎమ్మెల్యేలు తీగల, కేఎల్లార్ తదితరులు

'జనజాతర' ఏర్పాట్ల పరిశీలన

మహేశ్వరం: తుక్కుగూడలో ఈ నెల 6న కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనజాతర భారీ బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి, పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పరిశీలించారు. వేదికపై ఎంత మంది కూర్చుంటారు.. ఎక్కడి నుంచి వేదికపైకి వస్తారు.. వేదిక కింద మైదానంలో ఎంత మంది జనం కూర్చుంటారు.. వాహనాల పార్కింగ్.. జనాలు ఎక్కడి నుంచి ప్రవేశిస్తారు.. సభ ముగిశాక ఎక్కడి నుంచి తిరుగుముఖం అవుతారనే విషయాలను వేదిక నిర్మించేవారిని అడిగి తెలుసుకున్నారు. సభకు అన్ని నియోజకవర్గాల నుంచి సుమారు 10 లక్షల మందిని తరలించే లక్ష్యంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నేతలు తెలిపారు. సభకు జాతీయ స్థాయి నేతలు హాజరుకానున్న నేపథ్యంలో అదే స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ జాతీయ స్థాయి ఎన్నికల మేనిఫెస్టోను ఇక్కడి నుంచే విడుదల చేయనున్నారు. సభకు భారీ ఎత్తున జనాన్ని తరలించి విజయవంతం చేయాలని నేతలకు మంత్రులు సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, అనిల్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రామిరెడ్డి, జనక్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో 'సమ్మర్ డే క్యాంప్'

గచ్చిబౌలి: వేసవిని పురస్కరించుకొని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'సమ్మర్ డే క్యాంప్' నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఒకరోజు పాటు ఆహ్లాద పూరిత వాతావరణంలో సమ్మర్ డే క్యాంప్‌నకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రణాళికాబద్ధమైన కార్యకలాపాలు, కాక్టస్, మొలికా ఔషధ జాతులపై భౌతిక అధ్యయన పర్యటన, నక్షత్ర వనం, రాశివనం, నవగ్రహ వనం వద్ద మీ మొక్కను తెలుసుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పర్యావరణ విద్యా కేంద్రం, ఆడియో అండ్ వీడియో హాలును సందర్శించడం, జిప్‌లైన్, స్కైసైక్లింగ్ వంటి థ్రిల్లింగ్ అడ్వెంచర్లను ఆస్వాదించడం వంటి కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం ఆర్చరీ, హైరోప్ యాక్టివిటీస్ కమాండోనెట్, స్పైడర్ నెట్, బంగీ ట్రాంపోలిన్ మొదలైనవి ఉంటాయి. వివిధ రకాల ఫెర్న్‌లు, ఆర్కిడ్‌లు, క్రిమిసంహారక మొక్కలను సందర్శించే అవకాశం కల్పిస్తారు.



రాజకీయపార్టీల ప్రతినిధులకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియను వివరిస్తున్న కలెక్టర్ శశాంక

ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్ పూర్తి

రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించిన కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశారు. రాజేంద్రనగర్ ఈవీఎం గోడౌన్‌లో బుధవారం ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాలకు కేటాయించాల్సిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ గురించి కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ప్రక్రియ మొత్తాన్ని స్క్రీన్‌పై పారదర్శకంగా చూపించారు. ఈ ర్యాండమైజేషన్ జాబితా ఆధారంగానే జిల్లాలోని శాసనసభ నియోజకవర్గాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఆయా సెగ్మెంట్లలో స్ట్రాంగ్ రూముల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని భద్రపరుస్తామని చెప్పారు. ఎన్నికల సంఘం నిబంధనలను విధిగా పాటిస్తూ, పూర్తి పారదర్శకంగా నిర్వహణ ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శశాంక ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారులతో వేసవిలో నీటి ఎద్దడిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరిపడా ఉందని, సరైన ప్రణాళికతో సరఫరా చేసేలా చూడాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా చేతి పంపులు మరమ్మతు చేయించడమే కాకుండా అవసరమైతే వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకొని తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల, గ్రామ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 93474 92260కు ఫోన్ ద్వారా గానీ, వాట్సాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున జిల్లాలో ఏ ఒక్కరూ వడదెబ్బకు గురి కాకుండా చూడాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బకు చికిత్స అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఉపాధి కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లి మధ్యాహ్నం 12 వరకు తిరిగి వచ్చేలా చూడాలని పీడీ డీఆర్డీఏకు సూచించారు. పని ప్రదేశాల్లో చలువ పందిళ్లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తండాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఏర్పడితే నీటి సమస్యను పరిష్కరించడం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీలత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా కేటాయింపులు ఇలా..

- ఎల్బీనగర్ 713 బీయూ, సీయూలు, 799 వీవీప్యాట్లు
- మహేశ్వరంలో 671 బీయూ, సీయూలు, 751 వీవీ ప్యాట్లు
- రాజేంద్రనగర్‌లో 678 బీయూ, సీయూలు, 760 వీవీ ప్యాట్లు
- శేరిలింగంపల్లిలో 791 బీయూ, సీయూలు, 886 వీవీ ప్యాట్లు
- చేవెళ్లలో 372 బీయూ, సీయూలు, 417 వీవీ ప్యాట్లు
- షాద్‌నగర్లో 328 బీయూ, సీయూలు, 379 వీవీ ప్యాట్లు
- కల్వకుర్తిలో 338 బీయూ, సీయూలు, 379 వీవీ ప్యాట్లు
- ఇబ్రహీంపట్నంలో 428 బీయూ, సీయూలు, 480 వీవీ ప్యాట్లు

గ్రామాల అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్‌కు చెందిన ముగ్గురు మాజీ సర్పంచులు, వారి అనుచరులు, మీర్జాగూడకు చెందిన మాజీ సర్పంచ్ తన అనుచరులతో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి రంజిత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరం కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటూ అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. పార్టీలో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రేగడిఘనాపూర్‌కు చెందిన మాజీ సర్పంచులు తిప్పని రాంరెడ్డి, రాయికంటి నర్సింలు, షాబాద్ నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, యాదయ్య, నాయకులు కిష్టయ్య, పాండు, మీర్జాగూడ మాజీ సర్పంచ్ భీమయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, డీసీసీ నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డి, భీంభరత్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాష్ట్రంలో పాలన గాడితప్పింది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

- గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటే
- లోక్‌సభ ఎన్నికల్లో వాటికి బుద్ధి చెప్పాలి
- మహబూబ్‌నగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

షాద్‌నగర్: రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని మహబూబ్‌నగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ క్లాంప్లెక్స్‌లో బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండల నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఆర్భాటాలకు పోయి ఆరు గ్యారంటీలు చెప్పి అధికారంలోకి వచ్చిందని.. వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

పాలమూరు ప్రాజెక్టుపై వైఖరేమిటి?

పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని అరుణ డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని తెచ్చేలా మొదట్లో డిజైన్ చేశారని, ఆ తర్వాత మార్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాత డిజైన్ ఆమోదించి పరిపాలన అనుమతులు ఇప్పిస్తే కేంద్రం నుంచి తాము నిధులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదా గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ విభజన హామీ చట్టంలో ఎందుకు పొందుపర్చలేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల ఊసేలేదు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని డీకే అరుణ పేర్కొన్నారు. బీజేపీని అధికారంలోకి రానీయకుండా ఆ రెండు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, దేశంలో కాంగ్రెస్ పార్టీల ఊసేలేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ఎవరూ అంగీకరించడం లేదన్నారు. దేశానికి తిరిగి ఎవరు ప్రధానిగా ఉండాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, అందెబాబయ్య, వెంకటేష్‌గుప్తా, డీకే సిగ్మారెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కమ్మరి భూపాలాచారి, వంశీకృష్ణ, మురళీ, శివకుమార్, రుషికేష్, లష్కర్ నాయక్, అశోక్, శంకర్ నాయక్, ఇసునాతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోదీ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు

కొందుర్గు: దేశ ప్రజలు మళ్లీ నరేంద్రమోదీ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని డీకే అరుణ అన్నారు. చౌదరిగూడ ఆర్య సమాజంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలుపొందడం ఖాయమని, అందులో మహబూబ్‌నగర్ తప్పకుండా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌పై ఇష్టం లేక కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలంతా బీజేపీకి ఓటు వేస్తారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అందె బాబయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, భూపాలచారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL DISTRICT JUDGE
R.R. DISTRICT. AT L.B. NAGAR
OS No.626 of 2019

Between:
State of Telangana rep. by
Principal Secretary & amp; others ...Plaintiffs
AND
Abdul Asad Ameed & others ...Defendants
To,
1. Smt. Noorban Begam W/o Not known aged Major Occ: Not known, R/o Khanapur Village, Gandipet Mandal, R.R District ...Defendant No.3
2. Smt. Vemuri Laxmikanthamma W/o Venkaiah aged Major Occ: Not known, R/o H.No. LH-2, Lanko Hills, Manikonda Jagir, Gandipet Mandal, R.R District ...Defendant No.17
3. Smt. Radha Bhai W/o Venkaiah aged Major Occ: Not known, R/o. H.No.LH-2, Lanko Hills, Manikonda Jagir, Gandipet Mandal, R.R District ...Defendant No.18

Whereas the plaintiffs has instituted as suit against you for Declaration of Title and Recovery of Possession you are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the 16th day of April 2024 at 10.30 O'clock in the forenoon to answer the claim, and further you are here by directed to file within 30 days of service of summon a written statement of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence. has been tried by the court for appearing of the appeal. Take notice that in default of your appearance and file your written statement within 30 days the suit will be heard and determined in your absence.

//BY ORDER OF THE COURT \\
M. RAJ KUMAR, Advocate
Government Pleader, Ranga Reddy Dist
Flat No. 103, Sai Residency, Srinagar, LB Nagar, Hyderabad. Mob. 9989525927/9848057170

IN THE COURT OF THE PRL DISTRICT JUDGE
R.R. DISTRICT. AT L.B.NAGAR
IA No. 1362 of 2019
in
OS No.626 of 2019

Between:
State of Telangana rep. by
Principal Secretary & amp; others ...Petitioner/Plaintiffs
AND
Abdul Asad Ameed & others ...Respondents/Defendants
To,
1. Smt. Noorban Begam W/o Not known aged: Major Occ: Not known, R/o Khanapur Village, Gandipet Mandal, R.R.District ...Respondent/Defendant No.3
2. Smt. Vemuri Laxmikanthamma W/o Venkaiah aged: Major Occ: Not known, R/o H.No. LH-2, Lanko Hills, Manikonda Jagir, Gandipet Mandal, R.R District ...Respondent/Defendant No.17
3. Smt. Radha Bhai W/o Venkaiah aged: Major Occ: Not known, R/o. H.No.LH-2, Lanko Hills, Manikonda Jagir, Gandipet Mandal, R.R District. ...Respondent/Defendant No.18

Whereas the above-named petitioner filed under petition under order 39 rule 1 & amp:2 of C.P.C., has made application to this court, you are hereby wanted to appear in this court in person or by pleader duly instructed on the 16th day of April 2024 at 10.30 O'clock in the forenoon to show cause of against the Application, failing which, the said Application will be heard and determined exparty.

//BY ORDER OF THE COURT \\
M. RAJ KUMAR, Advocate
Government Pleader, Ranga Reddy Dist
Flat No. 103, Sai Residency, Srinagar, LB Nagar, Hyderabad. Mob. 9989525927/9848057170

జనావాసాల్లోకి జింక

అడవిలో వదిలిన గ్రామస్తులు



మజీద్‌పూర్‌లో ప్రత్యక్షమైన జింక

అబ్దుల్లాపూర్‌మెట్: అడవిలో ఉండాల్సిన జింక గ్రామంలోని నివాసాల మధ్య ప్రత్యక్షమైంది. గమనించిన స్థానికులు సంబంధిత అటవీశాఖ అధికారుల సూచనతో అడివిలో వదిలారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలో బుధవారం ఉదయం గ్రామానికి వచ్చిన జింకను వీధి కుక్కలు వెంటాడుతుండగా.. గ్రామానికి చెందిన మందుల బాలరాజు గమనించి కుక్కల నుంచి జింకను కాపాడి స్థానిక మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి సమాచారం ఇచ్చారు. సుధాకర్‌రెడ్డి ఫారెస్ట్ అధికారులకు విషయాన్ని వివరించగా, దానిని అడవిలోకే వదిలిపెట్టాలని సూచించినట్లు పేర్కొన్నారు. అధికారుల సూచన మేరకు మజీద్‌పూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో జింకను వదిలారు.

నేడే అవిశ్వాస పరీక్ష



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముగిసిన తర్వాత 'పట్నం' మున్సిపల్ పాలకవర్గం పరిస్థితి రోజుకో మలుపు తిరుగుతోంది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్, చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి ఎన్నికల ముందు కారు దిగి కాంగ్రెస్‌లో చేరింది. దీంతో చైర్‌పర్సన్‌పై ప్రత్యర్థి పార్టీలు అవిశ్వాసం తీర్మాణం ప్రవేశ పెట్టారు. అది వీగిపోవడంతో వైస్ చైర్మన్ పీఠం అధికార పార్టీ నేతలు కన్నేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై అవిశ్వాసం పెట్టాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో గురువారం బలపరీక్ష నిర్వహించనున్నారు.

క్యాంపుల నుంచి 'పట్నం' చేరుకున్న కౌన్సిలర్లు

బందోబస్తు నడుమ సమావేశం

ఇబ్రహీంపట్నం వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై కలెక్టర్‌కు ఇచ్చిన వినతి మేరకు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి సమక్షంలో ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ విశ్వాస పరీక్ష నిర్వహించనున్నారు. క్యాంపుల్లో ఉన్న కౌన్సిలర్లు ఇప్పటికే పట్నం చేరుకున్నారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఏకగ్రీవంగా సమావేశంలో తీర్మాణం చేస్తే బలపరీక్ష నెగ్గుతుంది. లేదంటే వీగిపోతుంది.

వైస్ చైర్మన్ పదవికి రాజీనామా

పరిస్థితులను గమనించిన వైస్ చైర్మన్ యాదగిరి పదవీగండం తప్పదని భావించి స్వచ్ఛందంగా మంగళవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు రాజీనామా లేఖ సమర్పించారు. రాజీనామా సమర్పించిన మూడు రోజుల్లో అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. గురువారమే రాజీనామా ఆమోదించారో లేదా అనే విషయం తేలనుంది.

వ్యక్తి బలవన్మరణం

తలకొండపల్లి: మద్యానికి అలవాటు పడిన ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పడకల్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లం రమేశ్(38) మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో భార్య రాణితో తరుచుగా గొడవపడుతున్నాడు. ఈ నెల 1న భార్యతో గొడవపడగా ఆమె కేశంపేట మండల పరిధిలోని చెవులపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న రమేశ్ రెండు రోజులుగా ఇంటి తలుపులు తీయలేదు. అనుమానం వచ్చిన చుట్టు పక్కల వారు తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసు కుని విగతజీవిగా కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లున్నారు.

కారు ఢీకొని విద్యార్థినికి గాయాలు

మొయినాబాద్: రోడ్డు దాటుతున్న విద్యార్థిని ఓ కారు ఢీకొట్టడంతో గాయపడింది. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం గండిపేట మండలం పుప్పాలగూడకు చెందిన కొత్తకోటి ధన్‌రాజ్ కూతురు ప్రగతి మొయినాబాద్‌లోని బాలాజీ మెడికల్ కళాశాల(భాస్కర మెడికల్ కళాశాల)లో చదువుతోంది. మార్చి 26న సాయంత్రం 4 గంటల సమయంలో ప్రతిమ కళాశాల నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతుండగా అజీజ్‌నగర్ వైపు నుంచి వచ్చిన కారు వేగంగా ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె కుడి చేయి విరిగింది. వెంటనే భాస్కర ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై బుధవారం గాయపడిన విద్యార్థిని తండ్రి ధన్‌రాజ్ మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బురద గుంటలో పడి బస్ డ్రైవర్ మృతి



గోపాల్‌దాస్ గణేశ్ మృతదేహం

మహేశ్వరం: డ్యూటీకి వెళ్తున్నాని చెప్పి వచ్చిన ప్రైవేట్ ఆర్టీసీ బస్ డ్రైవర్ బురదగుంతలో శవమై కనిపించాడు. ఈ ఘటన మండల కేంద్రంలో బావర్చి హోటల్ సమీపంలో చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌దాస్ గణేశ్ ముదిరాజ్(28) మహేశ్వరం ఆర్టీసీ డిపోలో ప్రైవేట్ బస్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. బావర్చి హోటల్ సమీపంలో బురద గుంతలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో ఉదయం 9:30 గంటల ప్రాంతంలో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులకు వివరాలు సేకరించారు. మద్యం సేవించడంతో ఆర్టీసీ అధికారులు విధుల్లోకి తీసుకోలేదని ఇంటికి వెళ్తున్న క్రమంలో బురద గుంతలో పడి చనిపోయినట్లు తెలుస్తోంది. తన కుమారుడు ఉదయం 8గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఉన్నాడని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: కుళ్లిన స్థితిలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు జూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తుక్కుగూడ ప్రాంతానికి చెందిన ముదావత్ అనిల్(21) స్థానికంగా ఉన్న కల్యాణ జ్యోతి కంపెనీలో ప్యాకింగ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. మార్చి 31న ఉదయం 9.30 గంటలకు స్నేహితుడు తరుణ్‌తో డ్యూటీకి వెళ్లాడు. రెండు గంటల అనంతరం తనకు తలనొప్పిగా ఉందని, ఆల్కహాల్ సేవించానంటూ ఇంటికి వెళుతున్నానని చెప్పి బయలుదేరాడు. ఇంటికి చేరుకోలేదు. కంపెనీ సమీపంలోని ఓఆర్ఆర్ పక్కన ఉన్న నీటి గుంతలో అనిల్ మృతదేహం తేలియాడుతుండడాన్ని గమనించిన సెక్యూరిటీ గార్డ్ పోలీసులకు సమాచారం అందించాడు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కంపెనీ యాజమాన్యంపై అనుమానం ఉందని మృతుడి సోదరుడు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, ప్రమాదవశాత్తు జరిగిన మరణంగానే ఉందని పోలీసులు భావిస్తున్నారు.

కోపంతో కారును కాల్చేశాడు..

మైలార్‌దేవ్‌పల్లి: ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన గొడవతో ఓ కారు దగ్ధమైన సంఘటన రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. ఆరాంఘర్ చౌరస్తాలో ప్రతి రోజు ఉదయం కర్నూల్, హైదరాబాద్‌కు ప్రయాణికులను తమ ప్రైవేట్ వాహనాల్లో సీరియల్ ప్రకారం తీసుకెళుతుంటారు. బుధవారం హసన్ నగర్ ప్రాంతానికి చెందిన అడ్డు సీరియల్ ప్రకారం రాలేదని మరో డ్రైవర్‌తో గొడవ పడ్డాడు. దీంతో నన్నే సీరియల్ ప్రకారం రమ్మంటావా అంటూ అడ్డు తన కారు అద్దాన్ని బండరాయితో ధ్వంసం చేశాడు. దీనిని ఓ డ్రైవర్ వీడియో తీస్తుండగా ఆగ్రహానికి లోనైన అడ్డు అతడి చేతిలోని ఫోన్ లాక్కుని నేలకేసి కొట్టాడు. ఫోన్ పగిలి పోవడంతో సదరు డ్రైవర్ అడ్డు కారు తాళం తీసుకున్నాడు. తాళం తీసుకుంటావా అంటూ కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు న్యాయం చేయండి

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



షార్ట్ సర్క్యూట్ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్‌లోని 16వ డివిజన్ పరిధిలోని శ్రీ సాయికృపానగర్ కాలనీలో మంగళవారం విద్యుత్ హైటెన్షన్ లైన్ షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 30 ఇళ్లలో గృహోపకరణాలు పాడయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి బుధవారం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాలనీలో ఓ ప్రైవేట్ సెల్యూలర్ కంపెనీ స్తంభాల వల్లే షార్ట్ సర్క్యూట్ జరిగిందని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే ఎమ్మెల్యే మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని పిలిపించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే టీకేఆర్

షార్ట్ సర్క్యూట్ సంభవించిన ఇళ్లను మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాడైన గృహోపకరణాలను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మీర్‌పేట పోలీసులకు తెలిపారు. ఆయన వెంట బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, కాలనీ అధ్యక్షుడు బలవంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భువనగిరి గడ్డపై బీజేపీ జెండా ఎగరాలి

పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్



దళితమోర్చా నాయకుడి ఇంట్లో అల్పాహారం తింటున్న డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: భువనగిరి గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. మున్సిపల్ కేంద్రంలో బుధవారం ఉదయం దళిత మోర్చా నాయకుడు దాసు ఇంట్లో అల్పాహారం చేసి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ హవా నడుస్తోందని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత ఖ్యాతిని పెంచిన గొప్ప నాయకుడు మోదీ అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో దేశం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీజేపీ ప్రభుత్వం రావాలని.. అది భువనగిరి గడ్డతోనే ప్రారంభం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సభ్యులు ప్రతాప్, పోరెడ్డి నర్సింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాయిని సత్యనారాయణ, మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

నాగర్‌కర్నూల్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి



హోటల్‌లో టిఫిన్ చేస్తున్న యువతితో ముచ్చటిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి డా.మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనను ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. ఆమనగల్లులో బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో ఉన్న వారితో ముచ్చటించారు. కొద్దిసేపు పూరీలు కాల్చి ఆకట్టుకున్నారు. అనంతరం హోటల్‌లో టిఫిన్ చేస్తున్న పలువురు మహిళలతో మాట్లాడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన ఎలా ఉంది.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం బాగుందా.. పార్టీ మహిళలకు అమలు చేస్తున్న పథకాలు ఎలా ఉన్నాయంటూ ఆరా తీశారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశామని చెప్పారు. కాంగ్రెస్‌పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓటమి తప్పదన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, కృష్ణనాయక్, మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మాణయ్య, నాయకులు బాల్‌రాం, వస్పుల శ్రీకాంత్, అలీం, నాజర్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై దాడికి యత్నించారని..

అన్నదమ్ములపై కేసు

చేవెళ్ల: పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐపై దాడికి యత్నించారంటూ అన్నదమ్ములపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన చేవెళ్ల ఠాణాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం.. చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వీరబ్రహ్మం వద్దకు మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన అనంతయ్య, అతని తమ్ముడు సురేశ్ ఠాణాకు వచ్చారు. అదే సమయంలో గ్రామానికి చెందిన జుట్టు కుమార్ ఎస్‌ఐ వీరబ్రహ్మంతో ఓ కేసు విషయం మాట్లాడుతుండగా.. అన్నదమ్ములు అనుమతి లేకుండా ఎస్‌ఐ కేబిన్‌లోకి వెళ్లి కుమార్‌ను పరుషపదజాలంతో దూషించారు. వారిని నిలువరిస్తున్న ఎస్‌ఐ వీరబ్రహ్మంపై చేయి చేసుకునేందుకు యత్నించి విధులకు ఆటంకం కలిగించారన్నారు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్స్ వారిని అడ్డుకుని స్టేషన్ నుంచి బయటకు పంపారు. దీంతో అన్నదమ్ములపై కేసు నమోదు చేశామన్నారు.

మాట్లాడేందుకు వెళ్తే కేసులా..?

ఈ విషయమై కేసు నమోదైన అనంతయ్య 'సాక్షి'తో మాట్లాడారు. మా గ్రామానికి చెందిన ఓ కేసు విషయంలో స్టేషన్‌కు వెళ్లామని.. ఎస్‌ఐ వీరబ్రహ్మంతో మా గ్రామానికి చెందిన కుమార్ ఉండడంతో నీవెందుకు వచ్చావని ప్రశ్నిస్తే ఎస్‌ఐ మా పై దురుసుగా ప్రవర్తించాడని ఆరోపించారు. తమను బెదిరిండంతో అక్కడ నుంచి వచ్చామన్నారు. త మపై కేసు నమోదు చేసినట్లు తెలిసిందని ఇదే విషయమై గురువారం విలేకరులతో మాట్లాడుతామన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



నరహరిని సన్మానిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మాస్‌మీడియా జిల్లా అధికారిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన నరహరికి బుధవారం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... వృత్తిలో ఉన్నంత వరకు మనం చేసిన సేవలు ప్రజలకు చిరకాలం గుర్తుంటాయని అన్నారు. వైద్య,ఆరోగ్య శాఖలో నరహరి వివిధ విభాగాల్లో పని చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగడం హర్షనీయమన్నారు. అందరికి అందుబాటులో ఉంటూ సేవలు అందించారని అన్నారు. వైద్యఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమాలను ఆయన ఎంతో సమర్థవంతంగా అమలు చేశారని అన్నారు. అనంతరం నరహరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డాక్టర్ చందులాల్ రాథోడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో అశ్లీల నృత్యాలు

108 మంది అరెస్టు

సనత్‌నగర్: అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తూ యువతను పెడదారి పట్టించేలా అనైతిక చర్యలకు పాల్పడుతున్న బేగంపేటలోని ఊర్వశి బార్ అండ్ రెస్టారెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి కూలీ రూ.600కు పెంచండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అంజయ్య

యాచారం: ఉపాధి కూలీలకు రూ.600 చొప్పున వేతనం పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో బుధవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఎండల తీవ్రతకు కూలీ గిట్టుబాటు కావడం లేదని, తాగునీటి, నీడ సౌకర్యాలు లేవని, చేసిన పనులకు ప్రతీ వారం వేతనాలు రావడం లేదని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. ఎండల తీవ్రత దృష్ట్యా తేలికపాటి పనులు చూపించాలని, చేసిన పనులకు ప్రతీ వారం బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని అధికారులను కోరారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తండ్రి ఆస్తిలో వాటాకోసం..

రెండో భార్య కుమారుడి నిరసన



ఇంటి ఎదుట బైఠాయించిన యాదగిరి

యాచారం: తండ్రి ఆస్తిలో వాటా కోసం రెండో భార్య కుమారుడు నిరసనకు దిగాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పంబలి సత్తయ్యకు ఇబ్రహీంపట్నం మండలం పెద్దతుల్లా గ్రామానికి చెందిన నర్సమ్మను వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఒక పాప పుట్టాక తల్లీకూతుళ్లు అనారోగ్యంతో మృతి చెందారు. అనంతరం సత్తయ్య ధర్మన్నగూడెంకు చెందిన శాంతమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. వారికి వెంకటయ్య, అండాలు, యాదగిరి ముగ్గురు సంతానం. శాంతమ్మ మృతి చెందడంతో గునుగల్‌కు చెందిన దేవరకొండ వెంకటయ్య, సాలమ్మ దంపతులు యాదగిరిని సాకేందుకు తీసుకెళ్లారు. యాదగిరిని సాకిన దంపతులు మృతి చెందడంతో ఆయన తుర్కయంజాల్ సమీపంలో మన్నెగూడలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. సత్తయ్య పేరిట ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమి తన సోదరుడు వెంకటయ్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. యాదగిరి తన తండ్రి ఆస్తిలో వాటా ఇవ్వాలంటూ పలుమార్లు కోరినా సత్తయ్య స్పందించలేదు. దీంతో ఆయన బుధవారం తన భార్య, పిల్లలతో కలిసి తక్కళ్లపల్లిలోని ఇంటి వద్ద నిరసనకు దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని యాదగిరికి నచ్చజెప్పారు. యాదగిరి నిరసన చేసే సమయంలో సత్తయ్య ఇంటి వద్ద లేడు. రెండో భార్య మృతి చెందిన తర్వాత కొత్తపల్లికి చెందిన సత్తమ్మను మూడో వివాహం చేసుకున్నాడు. సత్తమ్మకు ఒక కూతురు సంతానం.